వరి పంటకు తెగుళ్ల బెడద

- గింజ పట్టని వైనం
- కోత దశలో రైతులు ఆందోళన

పాన్‌గల్: యాసంగిలో మండలంలో సాగుచేసిన వరి పంటలు కోత దశలో ఉండగా, తెగుళ్లు సోకి పంట పూర్తిగా గింజలు పట్టకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రూ.వేలు ఖర్చు చేసి పంటలు సాగు చేసి కోత దశకు వచ్చిన సమయంలో ఈ విధంగా తెగుళ్లు సోకి పంటలు పూర్తిగా నష్టం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్లాడుతున్నారు. మండలంలోని అన్నారం, గోప్లాపూర్, కిష్టాపూర్, రేమద్దులలో 3వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.25వేలకు పైగా పెట్టుబడి పెట్టి పంటను సాగు చేస్తే దిగుబడి వస్తుందని ఆశపడిన రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. నష్టపోయిన వారిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తెగుళ్లు సోకిన వరి పంట

ఐదు ఎకరాల్లో నష్టం



ఎంతో కష్టపడి ఐదు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. దగుబడి వస్తుందని ఆశ పడితే తెగుళ్లతో పంటకు గింజలు పట్టకుండా, గింజలు పట్టినా అన్ని తాళ్లు ఉండటంతో పంట పూర్తిగా నష్టం వాటిల్లింది. గతంలో ఇలాంటి తెగుళ్లు చూడలేదు. నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి.

– ఎద్దుల తిరుపతిరెడ్డి, రేమద్దుల

వాతావరణ మార్పే కారణం

మండలంలో గత నెలలో కురిసిన అకాల వర్షాలు, ఆ తర్వాత ఎండలతో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వరి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. అగ్గి తెగుళ్లు, కాండం కుళ్లు, కాండం తొలుచు తెగుళ్ల కారణంగా వరి పంటకు నష్టం వాటిల్లింది. తెగుళ్లు సోకిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివారణకు మందులు పిచికారి చేయాలని రైతులకు సూచించాం.

– సాజీద్ రహమన్, ఏఓ, పాన్‌గల్.

క్లుప్తంగా

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



వీపనగండ్ల: క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించినప్పుడు ఉత్తమ ఆటగాళ్లుగా రాణిస్తారని ఎస్‌ఐ రామన్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని క్రీడాకారులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణ, రాము పాల్గొన్నారు.

గదుల నిర్మాణానికి శంకుస్థాపన



గోపాల్‌పేట: మన ఊరు – మనబడి కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గదుల నిర్మాణానికి సర్పంచ్ శ్రీనివాసులు, హెచ్‌ఎం రమాకాంత్ పనులు ప్రారంభించారు. తొందరలోనే పనులు పూర్తి చేసి గదులను అందుబాటులోకి తీసుకువస్తామని, విద్యార్థుల ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని సర్పంచ్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల్లో వసతుల పరిశీలన



అమరచింత: పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణ కోసం పరీక్ష కేంద్రాలను శనివారం అమరచింత మండలంలో అధికారులు పరిశీలించారు. ప్రత్యేకాధికారి, డీపీఓ సురేష్‌కుమార్ అన్ని పరీక్షా కేంద్రాలకు వెళ్లి వసతులను అడిగి తెలుసుకున్నారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 296 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎంఈఓ భాస్కర్ సింగ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



అమరచింత: గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులు ఆహారంలో చిరు ధాన్యాలను తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీపీ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్, వైఎస్ ఎంపీపీ కోటేశ్వర్, ఏపీఎం శ్రీనివాసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

వ్యాయామ విద్యతో ఉపాధి అవకాశాలు



కొల్లాపూర్: వ్యాయామ విద్యతో యువతకు ఎన్నో రకాల ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉస్మానియా యూనివర్సిటీ పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డా.రాజేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కొల్లాపూర్‌లోని హసిని టీటీఈడీ కళాశాలను సందర్శించారు. వ్యాయామ విద్య కోర్సు చదువుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కళాశాల నిర్వాహకులు సురగాని శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అధ్యాపకులు రాజేష్‌కుమార్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఓయూ బోర్డుఆఫ్ స్టడీస్ డైరెక్టర్ జీబ్లానాయక్ తదితరులు ఉన్నారు.

అధ్యాపకుడికి పరామర్శ

వనపర్తి: ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన అధ్యాపకుడు శేషయ్యను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్, నాయకులు కొమ్ము శ్రీనివాసు పరామర్శించారు. గుండె, నరాలకు సంబంధించి కొంత కాలంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ.. శనివారం నివాసంకు వచ్చిన ఆయనను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు.

నేటి నుంచి కేవీపీఎస్ బైక్‌యాత్ర



మహబూబ్‌నగర్ రూరల్: మహనీయుల జయంతిని పురస్కరించుకుని నేటి నుంచి 14వ తేదీ వరకు జిల్లాలో మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లెల మాణిక్యం రాజు తెలిపారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బైక్‌యాత్రల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలంటూ గ్రామాల్లో యువతను యాత్ర ద్వారా చైతన్య పరుస్తామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ దళిత, గిరిజనులకు రిజర్వేషన్ లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. దీని ప్రభావమే దేశవ్యాప్తంగా దళితులపై దాడులు, హత్యలు, అత్యాచార ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జడ్చర్ల మండలం నాగసాలలో ఆదివారం యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్ధన్, నాయకులు రాములు, వెంకట్రాములు, మొగులయ్య, శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

కొల్లాపూర్: కొల్లాపూర్ ఎంపీడీఓగా చెన్నమ్మ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆమె లాంచనంగా విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పనిచేసిన శ్రీనివాసు నుంచి ఆమె బాధ్యతలు అందుకున్నారు. చెన్నమ్మను ఎంపీపీ బోజ్యానాయక్‌తో పాటు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

భక్తుడికి సన్మానం

కొల్లాపూర్: పట్టణంలోని మాదవస్వామి ఆలయంలో మార్బుల్ గ్రానైట్ బండలు వేయించిన భక్తుడు ఊశన్నగౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు శనివారం సత్కరించారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డా.విజయ్‌కుమార్, వెంకటస్వామిగౌడ్, సతీష్, నరేందర్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, మల్లయ్య, లచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఏప్రిల్ మాసం మహనీయుల జన్మదినాలకు నెలువైందని మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. మహనీయుల జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 5న బాబుజగ్జీవన్‌రాం, 11న జ్యోతిరావుపూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు కొనసాగుతాయని, ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో దళిత, గిరిజన సామాజిక ప్రజాసంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకునే ఆనవాయితీ ఉందని, దళితుల సమస్యలు చర్చించాలని, కంప్యూటర్ యుగంలోనూ కులవివక్ష, అంటరానితనం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రక్తహీనత నివారణపై అవగాహన



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది



అన్నప్రాసన చేస్తున్న ఎంపీడీఓ ప్రసన్నకుమారి

పాన్‌గల్: పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మహిళా సంఘాల సభ్యులకు రక్తహీనత నివారణ, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుల సూచనలు పాటిస్తే రక్తహీనతను నివారించవచ్చున్నారు. మహిళ సంఘాల సభ్యుల రక్త నమూనాలు సేకరించి తెలంగాణ హబ్ కేంద్రానికి పంపించినట్లు వారు పేర్కొన్నారు.

వీపనగండ్ల: మహిళల్లో రక్తహీనతను గుర్తించి అవసరమైన సూచనలు చేసేందుకు ఎనీమియా రక్తహీనత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించినట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు.

పోషణ లోపాలను అధిగమించాలి

పెబ్బేరు రూరల్: పోషణలోపం కలిగిన చిన్నారులను గుర్తించి, చిన్నారులు పోషణలోపం నుంచి బయటపడేలా అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి కోరారు. శనివారం సర్పంచ్ వినీలారాణితో కలిసి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3ని సందర్శించారు. చిన్నారుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనురాధ, అంగన్‌వాడీ టీచర్ మంజులరాణి, ఆశావర్కర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్మూలనకు చర్యలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్

అమరచింత: చిన్నారులలో ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు రక్త పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారులకు రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బాల్యానాయక్

పాన్‌గల్: గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో సీపీఎం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. పోడు భూముల సమస్యలు, 10 శాతం రిజర్వేషన్ అమలు, ప్రతి గిరిజనతండాలో ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జిల్లాలోని గిరిజన తండాలను సందర్శించి సమస్యలపై ఆరా తీస్తూ గిరిజనులను చైతన్యం చేస్తామన్నారు. ఈనెల 10, 12 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో బాలునాయక్, రాజునాయక్, సోమ్లానాయక్, సర్పంచ్ శాంతమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు



పాన్‌గల్‌లో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ శనివారం తెలిపారు. మండలంలోని 9 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయం కలిపి 360 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 140 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లుగా అజీమ్‌పాషా, శివయ్య, డిపార్టుమెంటల్ ఆఫీసర్లుగా లోకారెడ్డి, కృష్ణ వ్యవహరిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఏర్పాట్లను పరిశీలించారు.

గోపాల్‌పేట: పదోతరగతి పరీక్షా కేంద్రాలను శనివారం ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహ పరిశీలించారు. మండల కేంద్రంలో రెండు కేంద్రాలలో సీసీ కెమెరాలు, నీళ్లు, టాయిలెట్లు వంటి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సౌకర్యాలు అన్ని సక్రమంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయవచ్చని పేర్కొన్నారు.

భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: వ్యవసాయ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టే బాధ్యత తహసీల్దాపై ఉందని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుతో మాట్లాడారు. గ్రామాల్లో కొంత మంది రైతులు భూములను అమ్ముకోవడం జరగుతుందని, అదుకు విరుద్ధంగా ఆ సర్వే నంబర్‌లోనే అమ్మిన వ్యక్తుల భూములు తొలగించకుండా భూములు అమ్మని రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో తొలగించడంతో అసలు రైతులు నిరాశకు గురవుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వెన్నచర్లలో సర్వే నంబర్ 41, ఇతర గ్రామాల్లోని 14 సర్వే నంబర్‌లో మిస్సింగ్ అయిన రైతులు చాలా ఉన్నారని తెలిపారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా భూములు అక్రమంగా మార్పిడి జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాటిని అరికట్టే బాధ్యత మీపైనే ఉందని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి గ్రామంలో విచారణ చేపట్టేందుకు చర్యలు చేపడుతానని తహసీల్దార్ తెలియజేశారు. ఎంపీపీ వెంట ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ రవికుమార్, వెంకటయ్య, పర్వతాలు, శివరావు తదితరులు ఉన్నారు.

ప్రజాదరణను ఓర్వలేకే అనర్హత వేటు



మాట్లాడుతున్న కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి

అమరచింత: రాహుల్‌గాంధీకి ప్రజల్లో విశ్వాసం పెరగడాన్ని జీర్ణించుకోలేక కేంద్ర ప్రభుత్వం అనర్హత వేటు వేసిందని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అదానీ చేతుల్లో ఉందని, ప్రధాని అదానీ, అంబానీల కోసమే ఉన్నాడని దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. ఇదే విషయాన్ని రాహుల్‌గాంధీ చెప్పడం నేరంగా చూపి సభ్యత్వంను రద్దు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడని కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీని కేసులతో భయపెట్టాలని మోదీ, అమీత్‌షా కలలు కంటున్నారని ఆరోపించారు. అదాని ఆర్థిక అవకతవకలపై జేపీసీ విచారణ చేసే వరకు కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. ఆత్మకూర్ మండలం రేచింతలలో ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క పర్యటనను విజయవంతం చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్, నాయకులు విష్ణు, తౌఫిక్, శ్యామ్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ



రేవల్లిలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. రేవల్లి మండలంలో శనివారం హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింది. మండలంలోని చెన్నారం, చీర్కపల్లి, గాంధీనగర్, గొల్లపల్లి, కేశంపేట, పాతతండా, కొత్తతండాలో పర్యటించి ప్రజలతో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సిలిండర్ రూ.500 ఇస్తామని, భూమి ఉన్న రైతులతో పాటు కౌలురైతులకు సైతం సంవత్సరానికి రూ.15 వేలు, భూమిలేని ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామన్నారు. ధరణిపోర్టల్ రద్దు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పర్వతాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనర్హత వేటు సరికాదు

చిన్నంబావి: రాహుల్‌గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ ఆడిటోరియంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే అందరం కలిసి పార్టీ అధికారంలోకి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, బీరయ్యయాదవ్, సాహెదాబేగం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాహుల్ గాంధీపై బీజేపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే చర్యలు తీసుకుందని కాంగ్రెస్ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. బీజేపి ప్రభుత్వం ప్రతిపక్షంలేకుండా చేయాలని ఇలాంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. అదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్‌లో బాలికను వెన్నచర్లకి చెందిన వ్యక్తికి ఇచ్చి ఈ నెల 14న వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న సీడీపీఓ వెంకటరమణమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు శనివారం దేవల్‌తిరుమలాపూర్‌కి వెళ్లి బాలిక తల్లి నాగలక్ష్మికి బాల్యవివాహం చేయవద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం బాలికను గ్రామంలోని ఉన్నత పాఠశాలకు పంపించాలని అధికారులు సూచించారు. పాఠశాలకు బాలికను పంపకుంటే నాగర్‌కర్నూల్ సఖి కేంద్రానికి బాలికను తరలిస్తామన్నారు.

రాష్ట్ర కమిటీ సభ్యుల ఎన్నిక

అమరచింత: దళిత హక్కుల పోరాట సమితిరాష్ట్ర కమిటీ సభ్యులుగా అమరచింతకు చెందిన రవీందర్, మాసప్ప ఎన్నికైనట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిని పలువురు నాయకులు సన్మానించి అభినందించారు.

కుట్టుమిషన్లు పంపిణీ



పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌లో మహిళా సంఘాల సభ్యులకు 2 యూనిట్ల కుట్టు మిషన్లను కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరమేశ్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో బ్యాంక్ లోన్ ద్వారా మంజూరైన మిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. రాములు, మధు, రాంప్రసాద్, లింగస్వామి, కుర్మయ్య, శివ, శేఖర్ పాల్గొన్నారు.

చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యవంతంగా పెరిగిన చిన్నారులకు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న మిగతా పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్య విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించి అంగన్‌వాడీ టీచర్లకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

వీపనగండ్ల: మండలంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 41 మంది దరఖాస్తు చేసుకున్నారని వారిలో 32 మంది హాజరైనట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. దరఖాస్తుదారుల నుంచి సేకరించిన సమాచారాన్ని ఉన్నత స్థాయి అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ప్రభోత్సవం



దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి ప్రభోత్సవం శనివారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ప్రభోత్సవ రథాన్ని మంగళ తోరణాలతో అలంకరించి భాజాభజంత్రీల మధ్య ప్రభోత్సవ రథాన్ని ముందుకు తీసుకువెళ్లారు. వారం రోజులుగా ఆలయంలో సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి రథోత్సవం నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేశారు.

చలివేంద్రం ప్రారంభం

అమరచింత: వేసవిలో దాహంతో అలమటిస్తున్న బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడుతున్నాయని ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, సీఐ రత్నం అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్ వద్ద వేసవిని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు చెన్నయ్య, పోషన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



అమరచింత: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామంతో పాటు జిల్లాలో అగ్రగామిగా నిలవాలని సర్పంచ్ మహెమూద, ఎంపీటీసీ పరమేష్ అన్నారు. శనివారం ఆత్మకూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులకు హాల్ టికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాఘవేంద్ర, ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్, నాగప్రియ, భానుప్రియ, తహేరా బేగం, షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.